ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

ప్రభుత్వ స్థలమే కదా.. కట్టేయ్..



అడంగల్‌లో ప్రభుత్వ భూమి అని ఉన్న దృశ్యం

- రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణం
- అధికార పార్టీ నేతల కబ్జాలో 1.84 ఎకరాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- మా వద్ద రికార్డులు లేవంటూ.. రెవెన్యూ దాటవేత


ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

చిన్నమండెం, జనవరి 13: ప్రభుత్వ స్థలమే కదా.. అడిగేవారుండరనే ధైర్యంతో అధికార పార్టీ నేతలు రూ.3 కోట్లకు పైగా విలువ చేసే 1.84 ఎకరాల స్థలంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అది అత్యంత విలువైన స్థలం.. ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. అది ప్రభుత్వ భూమి. ఈ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు మూడు వారాలుగా అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. ఈ అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీనికి తోడు.. తమ వద్ద రికార్డులు లేవంటూ దాటవేస్తున్నారు. ఫలితంగా అక్రమార్కులు పట్టపగలే యథేచ్ఛగా ఇళ్లు నిర్మిస్తున్నారు. చిన్నమండెం మండల కేంద్రంలో కలిబండ మార్గంలో ప్రధాన రోడ్డులో జరుగుతున్న తంతు ఇది. ఆక్రమణలపై అధికారులు స్పందించకపోవడంతో ఎంత మొత్తం చేతులు మారిందో అని ప్రస్తుతం మండల కేంద్రంలో సర్వత్రా ఒకటే చర్చ నడుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. కలిబండ మార్గం ప్రధాన మార్గంలో సర్వే నెంబరు 285/3లో 1.84 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాదాపు రూ.3 కోట్లకు పైగానే ఉంటుంది. ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలను చేపట్టడానికి గతంలో ఒక మాజీ సర్పంచ్ ప్రయత్నించాడు. ఈ విషయమై అప్పట్లో అన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు నిర్మాణాలను అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ భూమి అని దీనిని ఆక్రమించడానికి యత్నిస్తే క్రిమినల్ కేసులు తప్పవు అంటూ హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. దీంతో అతను కోర్టుకు వెళ్లాడు. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండిపోయింది. తర్వాత ఆ మాజీ సర్పంచ్ చనిపోయారు. తర్వాత ఆ వివాదం విషయం అందరూ మర్చిపోయారు. ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు నాటిన హెచ్చరిక బోర్డు మట్టిపాలై పోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కన్ను ఆ స్థలం పైన పడింది. ఎటువంటి జంకు, బొంకూ లేకుండా ఆ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు మొదలు పెట్టారు. నిత్యం జనసమ్మర్థంగా ఉన్న రోడ్డు కావడంతో వేలాది వాహనాలు వెళుతుంటాయి. దీంతో అందరూ ఈ నిర్మాణాలను ఆసక్తిగా గమనిస్తూ ఉన్నారు. ప్రభుత్వ స్థలం కదా అప్పట్లో అధికారులు బోర్డు పెట్టి ఉన్నారు. ఇప్పుడు నిర్మాణాలు ఎవరు చేస్తున్నారంటూ... చర్చించుకుంటున్నారు. అయితే ఈ నిర్మాణాల వైపు మండల రెవెన్యూ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. అసలు ఆ స్థలంతో తమకు సంబంధమే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ స్థలం మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉంటుంది. దీంతో ఈ అక్రమ నిర్మాణాల గురించి పట్టించుకోకుండా ఉండేందుకు పెద్ద మొత్తంలోనే చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ పెద్దలు ఇది తమకు సంబంధం లేదు.. అప్పట్లో ఎవరో తహసీల్దార్ ఉన్నప్పుడు కోర్టు అనుమతి ఇచ్చిందంటూ సమాధానం చెబుతున్నారు. కోర్టు అనుమతి ఇచ్చిన పత్రాల కోసం పది రోజులుగా మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ ఆంధ్రజ్యోతి తిరుగుతున్నా... అధికారులు ఆ పత్రాలు ఇవ్వడం లేదు. మా వద్ద లేవు. మీకు కావాలంటే.. నిర్మాణాలు చేపడుతున్న వాళ్ల దగ్గర ఉంటాయి చూడమంటున్నారు. విలువైన ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు, కోర్టు ఫైల్ తమ వద్ద లేదని అధికారులు ఏ ధైర్యంతో చెబుతున్నారో.? రేపు ఈ విషయమై ఉన్నతాధికారులు అడిగితే ఏం సమాధానం చెప్తారో.. వేచి చూడాల్సిందే. (ఒకవేళ కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చి ఉన్నా... ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీలు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉండాలి.) ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కినుక వహించడం వెనుక.. ఒక వీఆర్‌వో హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ వీఆర్‌వో పెద్ద మొత్తంలో మామూళ్లు తీసుకుని...నిర్మాణాల గురించి తన పై అధికారులను సైతం మేనేజ్ చేసి ఉంటాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు వీఆర్‌వో గతంలో పనిచేసిన చోట ఇదే విధంగా అక్రమార్కులకు వంతపాడి.. సస్పెండ్ అయ్యాడు. ఇక్కడా ఇదే తంతు కొనసాగిస్తున్నాడని సొంత శాఖలోని సిబ్బందే గుసగుసలాడుతున్నారు.

పేదలకైతే ఎన్ని నిబంధనలో...

సాధారణంగా ఎవరైనా పేద వాడు ఇంటి స్థలం కోసం అడిగితే రెవెన్యూ అధికారులు ఎన్నెన్నో నిబంధనలు పెడతారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చినా ఎక్కడో గుట్టలు, కొండలు, వంకల్లో స్థలం చూపిస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, డబ్బు ఉన్న వాళ్లు కావడంతోనే.. అత్యంత విలువైన స్థలాన్ని ఆక్రమిస్తున్నా.. రెవెన్యూ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన ఇటువంటి స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కోర్టు ఉత్తర్వు కాపీలు మా దగ్గర లేవు..

ఈ స్థలం విషయంలో కొందరు గతంలో కోర్టును ఆశ్రయించారు. వేరే తహసీల్దార్లు ఉన్నప్పుడు కోర్టు వాళ్లకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వాళ్లు ఇప్పుడు ఇళ్లు నిర్మాణాలు చేస్తున్నారు. ప్రస్తుతం కోర్టు ఉత్తర్వుల పత్రాలు మా దగ్గర లేవు. మీకు కావాలంటే.. నిర్మాణాలు చేపడుతున్న వాళ్ల దగ్గర ఆ కోర్టు ఉత్తర్వులు ఉండవచ్చు వెళ్లి తీసుకోండి.

- రాములునాయక్, తహసీల్దార్



మంచు దుప్పటి

- మదనపల్లెను కమ్మేసింది

మదనపల్లె అర్బన్, జనవరి 13: రెండు, మూడు రోజులుగా మదనపల్లెను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం 9 గంటల వరకు విపరీతమైన మంచు కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు కూడా మదనపల్లెను మంచు వదల్లేదు. చలితో కూడిన పొగమంచు కురుస్తుడడంతో జన సంచారం తగ్గింది. జాతీయ రహదారిలో వెళుతున్న వాహనాలు ఎదురెదురుగా కనిపించకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోననే భయంతో నెమ్మదిగా వాహనాలు నడుపుతున్నారు. మదనపల్లె సమీపంలోని ఎర్రకొండ, బసినికొండను మంచు కప్పేసింది.

కోడిపందేలు జరగకుండా చర్యలు

- ఎస్పీ కృష్ణారావు

ములకలచెరువు, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. అనంతరం సర్కిల్ పరిధిలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాటలు నిర్వహించినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేరాల నియంత్రణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్‌ఐలు గాయత్రి, రవీంద్రబాబు, లోకేశ్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ఇసుక రవాణాను అడ్డుకున్న స్థానికులు

- ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తే ఒప్పుకోం
- ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు, ప్రజలు

పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు, స్థానికులు




నదిలోకి వాహనాలు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్వుతున్న దృశ్యం

సుండుపల్లె, జనవరి 13: ప్రతిమా కంపెనీ పేరుతో ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిని స్థానిక రైతులు, ప్రజలు అడ్డుకున్న సంఘటన బాహుదానది సమీపంలో శనివారం జరిగింది. రాయవరం క్రాస్ సమీపంలోని కాజేవే సమీపంలో ఇసుక తరలించేందుకు ప్రతిమా కంపెనీ పేరుతో అనుమతులు పొందామని ఇసుక తరలించేందుకు యత్నిస్తుండగా జడ్పీటీసీ సభ్యుడు ఇస్మాయిల్, రైతులు, స్థానికులు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను అడ్డుకున్నారు. కొన్ని నెలల నుంచి జేపీ పేరుతో మండలంలోని ఇసుకను తరలించేశారు. మళ్లీ నెల గడవకముందే ప్రతిమా కంపెనీకి అనుమతులు ఉన్నాయని ఇసుకను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇక్కడ నుంచి ఇసుక తరలిస్తే ఒప్పుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తరలిస్తే స్థానిక రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుందని పల్లెలకు తాగునీరు కూడా ఉండదని వ్యతిరేకించారు. ఇసుకను తరలించేందుకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం ఏమిటని టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులతో పాటు రైతులు తీవ్రంగా ప్రభుత్వ తీరును తప్పు పట్టారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఫోన్ల ద్వారా పై అధికారులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. ఇసుక తరలించకుండా బాహుదానది సమీపంలో జేసీబీతో గుంతలను తవ్వించారు. ఇసుక తరలిస్తే ఒప్పుకునేది లేదని ఎంతటి వారు వచ్చినా సహించేది లేదని రైతులు హెచ్చరించారు. ఎటువంటి పేపర్లు లేకుండా, స్థానిక రైతులతో చర్చించకుండానే ఎలా ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తారని మండిపడ్డారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల కడుపులు నింపుకునేందుకు మాత్రమే ఇసుక రీచ్ పేరుతో రవాణాకు సిద్ధమయ్యారని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు, రైతుల మంచి కోరాల్సిన ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కొంతమంది కడుపులు నింపేందుకు ఈ విధంగా రీచ్ ఏర్పాటు చేయడం సమంజసం కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ ఇబ్బంది లేని చోట ఇసుక రీచ్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

హైదరాబాదులో మకాం వేసిన టీడీపీ నేతలు

రాజంపేట, జనవరి 13 : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా త్వరలో ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్న సందర్భంగా మూడు రోజులుగా రాజంపేట, రాయచోటి టీడీపీ నేతలు హైదరాబాదులో మకాం వేశారు. హైదరాబాదులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో మాట్లాడి తమకు టికెట్టు కేటాయించాలని కోరడానికి వెళ్లారు. రాజంపేట నాయకులు తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, రాజంపేట నియోజకవర్గ నాయకులు పోలి సుబ్బారెడ్డి, రైల్వేకోడూరు టీడీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి, రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తదితరులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, టికెట్టు కేటాయింపుపై వారు చర్చించినట్లు తెలిసింది.


హైదరాబాదులోని ఓ అతిథి గృహంలో సమాలోచనలు జరుపుతున్న టీడీపీ నేతలు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పోలి సుబ్బారెడ్డి, వేమన సతీష్ తదితరులు

నేడు, రేపు ప్రత్యేక రైలు



కడప (ఎడ్యుకేషన్), జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 15, 16 తేదీల్లో సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ (07489/07490) ప్రత్యేక రైలు కడప మీదుగా నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఈ నెల 15వ తేదీ రాత్రి 8.10గంటలకు రైలు బయల్దేరి కాచిగూడ, జడ్చర్ల, గద్వాల్, కర్నూలు, గుత్తి, తాడిపత్రి మీదుగా మరుసటి రోజు తెల్లవారుజామున 5గంటలకు ఎర్రగుంట్ల చేరుకుంటుందన్నారు. 5.40గంటలకు కడప, 6.30 రాజంపేట చేరుకుని ఉదయం 9గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. అదే రైలు తిరుగు ప్రయాణంలో తిరుపతిలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4.35గటలకు బయల్దేరి రాజంపేటకు సాయంత్రం 6, కడపకు 6.45, ఎర్రగుంట్ల 7.20కి, మరుసటి రోజు ఉదయం 6.25గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. సంక్రాంతిపండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ మార్గంలో ప్రత్యేక రైలును రైల్వేశాఖ ఉన్నతాధికారులు వేశారన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయచోటిలో అంగన్వాడీలకు మద్దతుగా కూర్చున్న టీడీపీ నాయకులు జగన్‌రాజు, ద్వారకనాథరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం



పండుగ పూట రోడ్లపాలు చేసిన జగన్‌రెడ్డి

- టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలకు న్యాయం చేస్తాం
- సంఘీభావంగా దీక్షలో కూర్చున్న జగన్‌మోహన్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం, ద్వారకనాథరెడ్డి
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్వాడీల దీక్షలు

రాయచోటి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి అతి పెద్ద పండుగైన సంక్రాంతికి కూడా అంగన్వాడీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్లపాలు చేశారని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు విమర్శించారు. సమ్మెలో భాగంగా 33వ రోజు శనివారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మెలకు టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, సుగవాసి బాలసుబ్రహ్మణ్యంలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ 33 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం అనేక ఇబ్బందులు, బెదిరింపులు సృష్టించినా ధైర్యంగా సమ్మెను కొనసాగిస్తున్న అంగన్వాడీలను టీడీపీ నాయకులు అభినందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు అంగన్వాడీలకు న్యాయం చేస్తారని తెలిపారు. అనంతరం అంగన్వాడీలకు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి చీరలు పంపిణీ చేశారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో భాగంగా శనివారం అంగన్వాడీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణను చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ 5 కోట్ల మంది ఓటర్లలో కేవలం లక్ష మంది ఉన్న అంగన్వాడీలు ఓటు వేస్తే ఎంత వేయకపోతే ఎంత అని మాట్లాడడం ప్రభుత్వం పతనానికి నాంది అని తెలిపారు. 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సంతకాల సేకరణ పేరుతో కోటి మందితో సంతకాలు సేకరించి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజానీకంతో పాటు అన్ని వర్గాల సహకారం కోరతామన్నారు. అంగన్వాడీలను ఉద్ధరిస్తానని పాదయాత్రలో జగన్ చెబితే నమ్మి ఓట్లు వేసి తప్పు చేశాము...మమ్మల్ని మన్నించు తండ్రీ అంటూ అంగన్వాడీలు మదనపల్లెలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గుంజిళ్లు తీస్తూ నిరసన తెలిపారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంగన్వాడీలు ర్యాలీ చేశారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రైల్వేకోడూరులో అంగన్వాడీలు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. రాజంపేటలో అంగన్వాడీలు శనివారం తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అంగన్వాడీలకు లేకుండా చేసిన ఈ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా అంగన్వాడీలు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని చెబుతున్నారు.


మదనపల్లెలో గుంజిళ్లు తీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


రాయచోటిలో కోటి సంతకాల కార్యక్రమంలో అంగన్వాడీలు

సంక్రాంతి సందడి

- కొనుగోళ్లతో కళకళలాడిన దుకాణాలు


పశువుల అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

పీలేరు, జనవరి 13: జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. పట్టణాల నుంచి పల్లెలకు పండుగకు తరలి వచ్చారు. దీంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. పీలేరు పట్టణంలో శనివారం మధ్యాహ్నం నుంచి సంక్రాంతి సందడి మొదలైంది. పండుగ కోసం దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు తరలివచ్చిన వారితో పీలేరు పట్టణ రోడ్లలో రద్దీ ఏర్పడింది. పెద్ద పండుగ కావడంతో కుటుంబాల్లోని పిల్లా పాపలకు, తల్లిదండ్రులకు కొత్త బట్టల కొనుగోలుకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో పట్టణంలోని వస్త్రదుకాణాలు నిండుగా కనిపించాయి. పూజాసామాగ్రి, పశువుల అలంకరణ, పూలదుకాణాలు, గాలిపటాలు, ముగ్గు రంగుల వ్యాపారం జోరుగా సాగింది. పీలేరు నుంచి స్వగ్రామాలకు తరలిన కుటుంబాలతో ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది.


దుస్తులు కొనుగోలు చేస్తున్న జనం


రంగులను కొనుగోలు చేస్తూ...




పూల దుకాణం వద్ద సందడి

చర్చల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం

- పండుగ పూట రోడ్లపాలు చేసిన జగన్‌రెడ్డి
- వేతనాలు పెంచేవరకు సమ్మె ఆగదు
- అంగన్‌వాడీ నేతల ప్రకటన



రైల్వేకోడూరు లో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



లక్కిరెడ్డి పల్లె: అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న చిన్నారులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 13: గత 33 రోజులుగా సమ్మె చేస్తున్నా అంగన్వాడీలను చర్చల పేరుతో జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌నాయక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్స్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజమ్మ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో భాగంగా 33వ రోజు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మెలకు టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, చమర్తి జగన్‌మోహన్ రాజు, సుగవాసి బాలసుబ్రమణ్యం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ 33 రోజులుగా ప్రభుత్వం అనేక ఇబ్బందులు, బెదిరింపులు సృష్టించిన ధైర్యంగా సమ్మెను కొనసాగిస్తున్న అంగన్వాడీలను వారు అభినందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు అంగన్వాడీలకు న్యాయం చేస్తారని తెలిపారు. అనంతరం అంగన్వాడీలకు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి చీరలు పంపిణీ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంతకాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్ మాట్లాడుతూ అంగన్వాడీలకు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలన్న ఆలోచన లేదన్నారు. జూలైలో వేతనాలు పెంచుతామని చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల హామీనే నెరవేర్చని ప్రభుత్వాన్ని ఇప్పుడు జూలైలో పెంచుతామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి సంతకం చేసిన అనంతరం సీఐటీయై నే రామాంజులుమాట్లాడుతూ రాష్ట్రంలోని 5 కోట్ల జనాభాలో కేవలం లక్ష మంది ఉన్న అంటన్వాడీలు ఓటు వేస్తే ఎంత వేయకపోతే ఎంత అని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడడం ప్రభుత్వ పతనానికి నాంది అని తెలిపారు. బెదిరిస్తే సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కోటి మందితో సంతకాలు సేకరించి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజానీకంతో పాటు అన్ని వర్గాల సహకారం కోరతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, లంబాడీ హక్కుల సంఘం నాయకులు శంకర్‌నాయక్, అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, బంగారుపాప, ఖాజాబీ, విజయమ్మ, అరుణ, సరస్వతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి, నాయకురాలు పద్మ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు లో అంగన్వాడీలు, ఆయాలు నిరసనలు నిర్వహించి, భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు ఆగవని తెలిపారు. ఈ కార్యక్రమం లో లీలా, శిరీషా, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మామయ్యా.. జీతాలు పెంచు

లక్కిరెడ్డిపల్లె: జగన్ మామయ్యా జీతాలు పెంచి అమ్మలను ఆదుకో మామయ్యా అంటూ అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలు శనివారం 33వ రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై కనికరించి కనీస వేతనంతో పాటు వారి సమస్యలు పరిస్కరించాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సెక్టారు లీడర్లు లక్ష్మీదేవి, నాగమణి, నాగవేణి, ఇరగమ్మ, శిరీష, శ్రీవాని, మూడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు,ఆయాలు పాల్గొన్నారు

రాజంపేట టౌన్: అంగన్‌వాడీ నేతలు ఈశ్వరమ్మ, అమరావతి, విజయ, శివరంజిని, లక్ష్మీ, ఇందూమతి, జ్యోత్స్న తదితరులు మాట్లాడుతూ పండుగరోజు కూడా ఆడవారిని ఇలా ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. ఒక్కో గ్రామానికి అందరు బిడ్డలను చూసుకుంటూ కన్నతల్లిలా వ్యవహరించే తమను 33 రోజులుగా వీధుల పాలు చేసినందుకు తమ ఉసురు తప్పక తగులుతుందన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న రమేశ్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 13: మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని నరసింహరాజుగారి పల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సురపరాజు, బలరామరాజు కుటుంబ సభ్యులు శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామికి కల్యాణో త్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు కాలాడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వ హించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా, అశోక్‌రాజు, బలరాం రాజు, శ్రీకాంత్ రాజు, ధర్మరాజు, గంగిరెడ్డి, బడుగు వాసుదేవుడు తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో న్యాయ యాత్ర విజయవంతం కావాలి



సరుకులు పంపిణీ చేస్తున్న డీసీసీ మైనార్టీ చైర్మన్ మన్సూర్ అలీఖాన్

రాయచోటిటౌన్, జనవరి 13: భార త్ జోడో న్యాయ యాత్ర విజయ వంతం కావాలని కోరుతూ శని వారం అన్నమయ్య డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణ పరిధి లోని గుడారాల్లో నివాసం ఉంటున్న వలస జీవులకు పేద, బడుగు, బల హీన వర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపడుతున్న న్యాయ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ం భారతదేశంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో రాహుల్‌గాంధీ మణిపూర్ నుంచి బాంబే వరకు సుమారు 6 వేల కిలోమీటర్లు న్యాయ యాత్రను ప్రారంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు షేక్. అల్లాబకష్, ఉపాధ్యక్షుడు దర్బార్‌బాషా, మైనార్టీ సెక్రటరీ యహియాబాషా పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

లక్కిరెడ్డిపల్లె, జనవరి 13: తెలుగుదేశం హయాంలో ప్రతి పేదవాడు సంతోషంగా పండుగ జరుపుకోవాలని చంద్ర బాబునాయుడు కానుకలు అందించేవారని వైసీపీ హయాంలో ప్రభుత్వంలో అవన్నీ దూరం చేశారని రాజం పేట పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం బి యర్రగుడి గ్రామంలో నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని మళ్లీ నిరు పేదల కడుపు నింపేందుకు అన్నక్యాంటీన్ , పండుగ కానుకలు అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలు గు యువత నాయకులు పాల్గొన్నారు

వెంకయ్యస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, జనవరి 13: పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు కారుమంచి చంద్రయ్య, గవనూతల ప్రభాకర్ ఆధ్వర్యంలో పూజలు, భజనలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

రామాపురం ఎస్‌ఐగా ప్రసాద్‌రెడ్డి



ఎస్‌ఐను సన్మానిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

రామాపురం, జనవరి 13: రామాపురం ఎస్‌ఐగా బీఎల్ ప్రసాద్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజంపేట టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై రామాపురం వచ్చాడు. రామాపురంలోపని చేస్తున్న కొండారెడ్డి చాపాడు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మ ర్యాద పూర్వకంగా ఆయనను కలిసి శ్రీరాముడి అక్షింత లు అందజేశారు. శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. విశ్వహిందూ పరిషత్ లక్కిరెడ్డి పల్లె ప్రఖండ అంజనరెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్ నాయుడు, గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా భజరంగదళ్ సంయోజక్ వీరారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, రాజేంద్ర, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

సుండుపల్లె, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15వ తేదీన కేఎం ఇండోర్ స్టేడియంలో సుండుపల్లె మండల స్థాయి బొబ్బిలిపులి వారి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకులు హరికుమార్, కాలేషా, రవి, విజయ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు ఉంటుందని, ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్ పేర్లను 14వ తేదీ సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ క్రింది ఫోన్ నెంబర్లు 9441848577, 8247830940లను సంప్రదించాలని తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

చిన్నమండెం, జనవరి13: కేశాపురం పంచాయతీ కడప-బెంగుళూరు జాతీయ రహ దారి ఆనుకుని ఉన్న తుమ్మలగొంది క్రాస్ ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న బంకును కారు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బెంగుళూరు నుంచి సంక్రాంతి పండుగ కోసం నలుగురు సాఫ్ట్‌వేర్ యువకులు ప్రొద్దు టూరుకు వెళ్తూ ఉండగా శనివారం ఉదయం 8.30 గంటలకు కారు రహదారి పక్క ఉన్న బంకును ఢీకొంది. దీంతో బంకు పాక్షికంగా దెబ్బతినింది. కారు ముందు భాగం దెబ్బతినగా, ప్రయాణిస్తున్న యువకులకు స్వల్ప గాయాలయాలయ్యాయి. నిత్యం టీ తాగేందుకు జనాలు వస్తుండే బంకు వద్ద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వారం రోజుల్లో సిద్దవటంలో అన్న క్యాంటీన్: గంటా



రాజంపేట అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న గంటా నరహరి

సిద్దవటం, జనవరి13 : మండల కేంద్రంలో వారం రోజుల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి తెలిపారు. శనివారం సాయంత్రం సిద్దవటంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయను న్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని, మొదటిది జనవరి 1న రాజంపేటలో ప్రారంభించామని, త్వరలో సిద్దవటం లోను, తర్వాత అన్ని కేంద్రాల్లో ప్రారంభిస్తామన్నారు. పేదవానికి పట్టెడన్నం పెట్టాలన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజంపేట : రాజంపేటలోని అన్న క్యాంటీన్‌లో గంటా నరహరి పేదలకు భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఏర్పాట్లు, భోజనంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నాగముని రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సుబ్బరాయుడు, యువనాయకులు రాజేష్‌నాయుడు, జ్యోతి, సుబ్బారెడ్డి, పిడికిటి సంతోష్‌నాయుడు మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, జిల్లా వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి పలుకూరి ఉగ్రవీంద్ర, ఒంటిమిట్ట టీడీపీ నాయకులు బొబ్బిలి రాయుడు, తాళ్లపాక నాయకులు అంజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అంతకముందు సిద్దవటం మాజీ ఎంపీపీ శ్రీరాములునాయుడు, యువ నాయకులు రాజానాయుడు ఇంటికి వెళ్లి వారితో టీడీపీ స్థితిగతులపై చర్చించారు.

నందలూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజంపేట నియో జకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ మెజారిటీ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని గంటా నరహరి తెలిపారు. శనివారం మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యంను ఆయన స్వగృహంలోకలిశారు. రాజకీయాల అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పల్లె రెడ్డయ్య, అరిగె ఈశ్వరయ్య, పల్లె ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

దేశంలోనే అత్యంత ధనిక నేరస్తుడు ఏపీ సీఎం : కస్తూరి



చిట్వేలి:క్రీడాకారులతో మాట్లాడుతున్న కస్తూరి తదితరులు

రైల్వేకోడూరు, జనవరి 13! దేశంలోనే అత్యంత ధనిక నేరస్తుడు ఆంధ్రప్రదేశ్ సీఎం అని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆరోపించారు. శనివారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అప్పులు దండిగా ఉన్నా, అభివృద్ధి మాత్రం కనిపించడం లేదన్నారు. సీఎం జగన్‌పై 38 కేసులు ఉన్నాయన్నారు. 43 వేల కోట్ల రూపాయల దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జిషీటు కూడా దాఖలు చేసిందన్నారు. ఈ కేసులకు సంబంధించి అత్యధికంగా 3500 వాయిదాలు తీసుకుని దేశంలోనే రికార్డ్ సృష్టించాడన్నారు. నేరం చేయకపోతే శిక్ష పడుతుందనే భయం లేకపోతే కోర్టు విచారణలకు హాజరై తుది తీర్పు పొందవచ్చు కదా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల టీడీపీ అధ్యక్షుడు ఆరే సుధాకర్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు పుల్లెల రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాపెర్ల చంద్రశేఖర్, రైల్వేకోడూరు నియోజకవర్గ ఆర్టీఎస్ కో-ఆర్డినేటర్ తుంగా నవీన్‌కుమార్, శేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: కె.కందులవారిపల్లె యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటును మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి, పారిశ్రామిక వేత్త విశ్వేశ్వర్‌నాయుడుతో కలిసి కస్తూరి టాస్ వేసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో నాయిని బాలాజీ, రవీంద్రనాయుడు, బొంగటావుల రాజశేఖర్, మండల మాజీ అధ్యక్షుడు కందుల గుండయ్య, ఏదోటి రాజశేఖర్, అనంతయ్య యాదవ్, రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, కందులవారి పల్లె యువత తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల సంబరాలు



ముగ్గుల పోటీ విజేతలతో మానవత సభ్యులు



ముగ్గులను పరిశీలిస్తున్న అతికారి దినేష్

రాయచోటిటౌన్, జనవరి13: రాయచోటి మానవత సంస్థ ఆధ్వర్యంలో ఎన్జీవో కాలనీలోని రామాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయినులు కళావతి, నిర్మల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మొదటి బహుమతి పొందిన లలితకు మానవత గౌరవ సలహాదారు లోకనాథరెడ్డి రెండవ బహుమతులు భార్గవి, మాధిలకు న్యాయ నిర్ణేతలు అందజేశారు. మూడవ బహుమతి మాధవికి మానవత రాయచోటి చైర్మన్ గంగిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ఆనందరెడ్డి అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మానవత అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ వెంకట్రమణ నాయుడుతో పాటు మానవత కుటుంబ సభ్యులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి అంకం జయచంద్రారెడ్డి, వృక్షోరక్షణ సమితి సభ్యులు తులసిరెడ్డి, మానవత కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, గౌరవ సలహాదారులు వెంకట్రమణ, కోచైర్మన్ షకీల్, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, పీరయ్య, పోలంరెడ్డి విశ్వపతిరెడ్డి, వేషారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

నందలూరు: రంగవల్లులతో ఇంటికి ప్రత్యేక అందం సంతరించు కుంటుందని జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త అతికారి దినేష్ తెలిపారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మన ఊరు, మన ఆట వీర మహిళల సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం రంగవల్లుల పోటీలను రాష్ట్ర జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన, మండల జనసేన పార్టీ నాయకులు కొట్టే శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సౌమ్యనాథస్వామి దేవాలయ సమీపంలో ఏర్పాటు చేసిన పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన పసుపులేటి భారతికి గ్రైండర్, ద్వితీయ స్థానం పొందిన స్వప్నకు మిక్సీ, మూడవ బహుమతి గ్యాస్ స్టవ్‌ను స్వీటీ అందుకున్నారు. 4, 5, 6 స్థానాలలో నిలిచిన వారికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

చెయ్యేరులో సంక్రాంతి సంబరాలు

నందలూరు : మండల పరిధిలోని ఇసుకపల్లె వద్ద చెయ్యేరు నదిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు గుండు మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకపల్లె, కుమ్మరపల్లి, హరిజనవాడ, రాచపల్లి ప్రజల సహకారంతో కనుమ పండుగ, 16న పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం మూడు గంటలకు ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి సహకారంతో విజేతలకు మొదటి బహుమతి వాషింగ్ మెషీన్, రెండు, మూడవ బహుమతులు కుక్కర్, మిక్సీని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫర్నిచర్స్ అండ్ హోమ్ నీడ్స్ వారు అందజేయనున్నట్లు తెలిపారు. నాలుగో బహుమతి బకెట్ సెట్‌ను గుండు జనార్దన్‌రెడ్డి సహకారంతో అందజేయనున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ (పది సంవత్సరాలలోపు) కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఆర్కెస్ట్రా కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సాయం



సరుకులు అందిస్తున్న రేఖం నారాయణ, ఎంపీటీసీ తులసి

రామాపురం, జనవరి 13: మండలంలోని కసిరెడ్డి గారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారా యణపురానికి చెందిన టీ. నాగేశ్వర్ కంకరమిషన్‌లో కార్మికుడు. విధి నిర్వహణలో ఉండగా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీ మన్నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేఖం నారాయణ ఆయన కుమార్తె ఆ గ్రామ ఎంపీటీసీ రేఖం తులసి, రేఖం మనోజ్‌కుమార్, నిత్యావసర సరుకులు, బియ్యంతో పాటు నగదును శనివారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

ఐటీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

చిట్వేలి, జనవరి 13: రాజుకుంట ఆరోగ్య ఉప కేంద్రంలో శనివారం ఐటీ ఉద్యోగులు నిర్వహించిన రక్తదాన శిబిరరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని యువత కు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుత్తి నరసింహ, రెడ్‌క్రాస్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, కనకరాజు, ప్రభార్, రాజేష్, సుధీర్, ఇంతియాజ్ అహమ్మద్, ప్రతాప్, మురళి, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: రక్తదానం మహా పుణ్యకార్యం అని సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలో శని వారం నిర్వహించిన రక్తదాన శిబి రంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్త దానం చేయవచ్చునని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్‌కి అవాజ్ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

రాయచోటిటౌన్, జనవరి13: ఆప్‌కీ అవాజ్ నూతన సంవత్సర ఉర్దూ, ఆంగ్ల క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహబూబ్‌బాషా, ఏపీ వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జీవానందం ఆవిష్కరించారు. శనివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మక్బూల్‌తో పాటు ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, సీపీఎం (ఎంఎల్) జిల్లా కన్వీనర్ మావులూరి విశ్వనాథ్, బాస్ కార్యకర్త పీ. అక్బర్, నవత యువజన సంఘం అధ్యక్షులు మామయ్య, సామాజిక కార్యకర్త కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

ముగిసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర

చిన్నమండెం, జనవరి13: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర ముగిసిందని ఎంపీడీవో దివ్య తెలిపారు. బీజేపీ అన్నమయ్య జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు శివప్రసాద్, సర్పంచ్ ముసల్‌రెడ్డి అర్హులకు ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. డ్రోన్‌సాయంతో పురుగుమందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు డెమో ద్వారా వివరించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డెమో రైలు రేణిగుంట వరకు పొడిగింపు



ఎల్‌పీ, ఏఎల్‌పీలను సన్మానిస్తున్న స్థానికులు

నందలూరు, జనవరి 13 : నంద్యాల నుంచి కడప వరకు ఉన్న డెమో రైలును రైల్వే అధికారులు 13వ తేదీ నుంచి రేణిగుంట వరకు పొడిగించడంతో శనివారం అన్నమయ్య జిల్లా నందలూరుకు చేరుకున్న డెమో రైలును వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, స్వాగతించి లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్‌లను పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ కరీముల్లాఖాన్, న్యాయవాది షమీఉల్లాఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపాటి నరసింహశెట్టి, చోటా నూర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఆధ్యాత్మిక కేంద్రమైన ఒంటిమిట్టలో భక్తుల రాకపోకలు పెరగడంతో పాటు తిరుపతి నంద్యాల నుంఝుట పెద్దఎత్తున భక్తులు వచ్చేందుకు అనువుగా ఉంటుందని మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక చేనేతలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రైలు ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



యువకులతో మాట్లాడుతున్న యల్లటూరు శ్రీనివాసరాజు

నందలూరు, జనవరి 13: నేటి యువత విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాజం పేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు ఆకాంక్షించారు. మండలం లోని నాగిరెడిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రబ్బర్‌బాల్ క్రికెట్ టోర్నమెంటుకు శనివారం ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా 15వేల రూపాయలు, ద్వితీయ బముమతిగా 10వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెటశివప్రసాద్, కమిటీ సభ్యులు మణి, కాశి, వెంకటేష్, సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివ, భార్గవ్, సుబ్రమణ్యం, షంషీర్, వై.సుబ్రమణ్యం, సుబ్బు, అస్లాం, తల్హా, నవీన్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

'మానవత' సేవలను విస్తరించాలి

సుండుపల్లె, జనవరి 13: మానవత సంస్థ సేవలను మరింత విస్తరించాలని మండల చైర్మన్ మిన్నమరెడ్డి గంగిరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు నిరాశ్రయులకు దుప్పట్లు, 32 మంది పంచాయతీ సహాయకులకు చీరలు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ జిల్లా అధికారి ధనుంజయ, మానవతా సెక్రెటరీ రెడ్డెప్ప నాయుడు, సభ్యులు రామకృష్ణారెడ్డి, రెడ్డిచర్ల నాగేశ్వరరావు, శివ కుమార్, గణపతి నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గాలివీడు, జనవరి 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు దశా బ్దాల పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదు భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్య నభ్యసించిన పాఠశాలను, గురువులను మరువ కుండా మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం మంచి సంప్రదాయం అన్నారు. అనంతరం గురువులు కానాల బయ్యారెడ్డి, మల్లన్న, నరసింహారెడ్డిని పూల మాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయుడు గౌస్‌మొహిద్దీన్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంతరం పూర్వపు ప్రధానోపాధ్యాయుడు బీ. రెడ్డెన్న, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్ ఉపాధ్యాయులు కానాల శివారెడ్డి, సౌభాగ్యమ్మ, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల టీడీపీ మాజీ అధ్యక్షుడి మృతి

వీరబల్లి, జనవరి13: మండలటీడీపీ మాజీ అధ్యక్షుడు రామకృష్ణంరాజు (70) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఉదయం గుండెపోటు రావడంతో రాయచోటి ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆసుపత్రికి వెళ్లి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు, కార్యకర్తలు పార్థివదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


అల్మా మృతదేహం

రాయచోటిటౌన్, జనవరి13: స్థానిక రవిహోల్ సమీప బలరామరాజువీధి వాసి షేక్. జిలానీ భార్య అల్మా (21) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసు ల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... జిలానీ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి అల్మా రెండో భార్య, జిలానీ మొదటి భార్యకు కుమారుడితో కలిసి కొత్తపల్లిలో ఉంటున్నారు. ఈ క్రమంలో అల్మా తల్లి ఇటీవల కువైట్ నుంచి ఇండియాకు వచ్చి కుమార్తెను చూసేందుకు శుక్రవారం రాత్రి రాయచోటికి వచ్చింది. కుమారై, అల్లుడు జిల్లానితో కలిసి భోజనం చేసిన అనంతరం వ్యాపారం రీత్యా మదనపల్లెకు వెళుతున్నానని శుక్రవారం రాత్రి జిలానీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఇంట్లో అల్మా, ఆమె తల్లి కలిసి బెడ్ రూమ్‌లో పడుకున్నారు. అయితే తెల్లవారి చూసేసరికి అల్మా ఇంట్లోనే హాల్లో అచేతనంగా పడి ఉండడం చూసి ఆమె తల్లి కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని జరిగిన సంఘటనపై సమాచారాన్ని పోలీసులకు అందించారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతు రాలి భర్త, మరికొరి కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ - మహిళ మృతి


గంగాదేవి మృతదేహం

ఖాజీపేట, జనవరి 13: కడప-కర్నూలు జాతీయ రహదారిపై రహమత్‌ఖాన్‌పల్లె వద్ద కారు, స్కూటర్ ఢీకొనడంతో సి.గంగాదేవి (40) మృతిచెందింది. వివరాల్లోకి శితే... దువ్వూరు మండలం గుడిపాడు వాసి సి.బాలవర్ధరాజు, గంగాదేవి శనివారం సాయంత్రం సంక్రాంతి పండుగకు సిద్ధవటం మండలం వెంకటాయపల్లెలో ఉన్న కూతురు వద్దకు వెళుతుండగా రహమత్‌ఖాన్‌పల్లె వద్ద కారు స్కూటర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగాదేవి మృతిచెందినట్లు వారి బంధువులు తెలిపారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడు....


పుల్లయ్య మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 13: స్థానిక మెడికల్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తా పడడంతో గురకల పుల్లయ్య (62) మృతిచెందగా అన్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... వేముల మండలం పెండ్లూరు వాసి పుల్లయ్య రైడ్స్ డైరెక్టర్ త్యాగరాజు తోట వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. తోటలో క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న జమ్మలమడుగు వాసి అన్వర్ ఆటోలో ఎక్కారు. మెడికల్ కళాశాల సమీపంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య మృతి చెందగా అన్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, అన్వర్‌ను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పెద్దిరెడ్డి దుర్మార్గాలకు బీసీలు బుద్ధిచెబుతారు

బీసీవైపీ కార్యకర్తలపై దాడిచేసిన పోలీసులపై హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న కరుణాకర్

ప్రొద్దుటూరు, జనవరి 13: జగన్ ప్రభుత్వంలో బీసీలు మీటింగులు పెట్టుకున్నా సహించలేని స్థితిలో వున్నారని బీసీలకు రాజ్యాధికారంలో భాగం కల్పిస్తున్నామని చేస్తున్న సామాజిక యాత్ర ఎంతబూటకమో పుంగనూరు ఘటన రుజువు చేస్తోందని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ విమర్శించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో సభ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడం చూస్తే బీసీలపట్ల జగన్ వైఖరి తేటతెల్లమౌతోందన్నారు. పుంగనూరులో బీసీ సభను పోలీసుల చేత అడ్డుకోవడమే కాకుండా వారిపై చెప్పులతో దాడులు చేయడం హేయమైన చర్య అని, జగన్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. పుంగనూరులో ప్రజాస్వామ్యం లేదని పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేల రాజ్యాంగం, రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందన్నారు. పుంగనూరు ఘటనపై హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ తరపున జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

హత్య కేసులో సిబ్బందికి ఎస్పీ అభినందనలు


ప్రశంసాపత్రాలతో సిబ్బంది

కడప (క్రైం), జనవరి 13: డిగ్రీ విద్యార్థిని హత్య కేసులో ముగ్గురు నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అభినందించారు. బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో డిగ్రీ విద్యార్థిని హత్య జరిగింది. ఈకేసును ఫాస్ట్ ట్రాక్ కేసుగా పరిగణించి తగిన సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ ఆర్వీ నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఎ.సురేష్ బాబు (హెచ్‌సీ 892), కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ జాకబ్ (హెచ్‌సీ 402)ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందించా రు. ఎస్పీ మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కేసు ట్రయల్ సమయంలో సాక్షుల విచారణ, కేసు రికార్డులు, కోర్టు వ్యవహారాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి కేవలం రెండేళ్ల ఐదు నెలల్లో నిందితులకు శిక్ష పడేలా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య జయంతి వేడుకలు


బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్‌కుమార్, డాక్టర్ చెన్నూరు సుధాకర్, టీడీపీ నేతలు

రాజంపేట, జనవరి13: మాజీ మంత్రి, దివంగత పసుపులేటి బ్రహ్మయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్ కుమార్ టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చెన్నూరు సుధాకర్, రాష్ట్ర బీసీ నేతలు ఇడమడకల కుమార్, మైనార్టీ నేతలు అబూబకర్ బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అభివృద్ధిలో నియోజకవర్గ స్ఫూర్తిప్రదాత అని బ్రహ్మయ్యను కొనియాడారు.



చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సహాయ కమిషనర్ జనార్దనరెడ్డికి రూ. 1,00,116 విరాళం అందచేస్తున్న కడప వాసులు ఇడెం హరిబాబు, రాజేశ్వర్లు

జిల్లాలో 55.99 లక్షల నగదు సీజ్

ప్రొద్దుటూరులో రూ. 35లక్షలు ● పులివెందులలో రూ.14.99 లక్షలు ● పోరుమామిళ్లలో రూ.6లక్షలు స్వాధీనం

ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచనతో ఆదాయపన్ను అధికారులకు అప్పగింత

ప్రొద్దుటూరు, జనవరి 13: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 55లక్షల రూపాయల నగదును పోలీసులు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక అమ్మవారిశాల నాలుగురోడ్ల జంక్షన్‌వద్ద వన్‌టౌన్ ఎస్ఐలు హైమావతి మంజునాథ్ పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీలో రూ.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల మండలం కనంపల్లె చెక్ పోస్టు వద్ద రూ.14.99 లక్షలు, పోరుమామిళ్ల మండలం మల్లకత్తువ చెక్‌పోస్టు వద్ద రూ.ఆరు లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఎలాంటి బిల్లులు లేకుండా బస్సు, కార్లలో తరలిపోతున్న డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళితే....

శనివారం సాయంత్రం అమ్మవారిశాల నాలుగు రోడ్ల జంక్షన్‌వద్ద వన్‌టౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఒక వ్యక్తి బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతని బ్యాగులో డబ్బు కట్టలు కనపడ్డాయి. దీంతో అతన్ని పోలీసు స్టేషనుకు తీసుకొచ్చి విచారించి నగదుకు తగిన ఆధారాలు చూపమని కోరగా ఎలాంటి రసీదులు, బిల్లులు చూపని కారణంగా రూ.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఆ డబ్బు వ్యాపారానికి చెందినదిగా తెలిపినా ఆధారాలు చూపలేకపోయాడన్నారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా నగదును రెవెన్యూ అధికారులతో పంచినామా చేసి తదుపరి చర్యల నిమిత్తం తిరుపతి ఆదాయపన్ను అధికారులకు అప్పగిస్తామన్నారు. పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడంతో వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు హైమావతి, మంజునాథ్ సిబ్బందిని ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ ప్రేర్ణకుమార్ అభినందించారు.



ఆధారాలు లేని నగదుతో ప్రొద్దుటూరు సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు - పోలీసు అధికారులు సీజ్ చేసిన రూ.6లక్షలు నగదుతో పోరుమామిళ్ల పోలీసులు

కనంపల్లె చెక్‌పోస్టు వద్ద....

పులివెందుల టౌన్, జనవరి 13: జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా పులివెందుల మండలం కనంపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్నారు. అయితే బెంగళూరు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న బెంగళూరు వాసి గంజికుంట సుధాకర్ వద్ద రూ. 14.99 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. అయితే అతని వద్ద డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు తదుపరి చర్య నిమిత్తం నగదును ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని తెలిపారు.

మల్లకత్తువ చెక్‌పోస్టు వద్ద....

పోరుమామిళ్ల, జనవరి 13: మల్లకతవ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీలో కారులో తరలిపోతున్న రూ.6లక్షలు సీజ్ చేసినట్లు సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మదనపల్లి నుంచి మార్కాపురం వైపు వెళుతున్న ఏపీ 39 జీఎస్ 9966 నెంబరు కారును తనిఖీ చేయగా అందులో మార్కాపురం వాసి చిరంజీవి వద్ద ఎలాంటి బిల్లులు లేకుండా రూ.6లక్షలు ఉండడంతో విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల ప్రకారం ఆ నగదును సీజ్ చేసి ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటుకు పంపించినట్లు సీఐ తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

అలరిస్తున్న గొబ్బెమ్మ పాటలు ● ఆటలాడుతున్న మహిళలు ● ప్రతి వీధిలోనూ పండుగే...



రైల్వేకోడూరు కొత్తబజారు వీధిలో గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు - కోలాటాలు వేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, జనవరి 13: గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రాత్రి వేళ గొబ్బెమ్మ పాటలు అలరిస్తున్నాయి. పండుగ నెల పెట్టిన నాటి నుంచి రైల్వేకోడూరు పట్టణంలో ప్రతి వీధిలోనూ గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి రోజూ రాత్రిళ్లు పాటలు పాడుతూ కోలాటాలు ఆడుతున్నారు. సంక్రాంతి పండుగ కోసం ప్రజలు ఇప్పటికే ఇళ్లకు రంగులు వేసుకున్నారు. కొత్త బట్టలు కొనుగోలు చేస్తున్నారు. రంగు, రంగుల ముగ్గులను మహిళలు ఇంటి ముంగిట వేసుకున్నారు. భోగ భాగ్యాలను ఇచ్చేది భోగి పండుగ, సంక్రాంతి పండుగ రోజున ఇంట్లో చనిపోయిన పెద్దలు వారివారి ఇండ్లకు వస్తారని అందు కోసం వారికి ఇష్టమైన వంటకాలు, పండి వంటలు చేస్తారు. చివరి రోజు అయిన కనుమ పండుగ పశువులను ఊరేగించే పండుగ. పశువులను గ్రామీణ ప్రాంతాల్లో బండ్లకు కట్టుకుని, అలంకరించి తిప్పడం అనవాయితీగా ఉంది. ఇదే కాకుండా ఈ మూడు పండుగలు పెద్ద ఖర్చుతో కూడుకున్నది. కొత్తబట్టలు దగ్గర నుంచి ఇళ్లకు పెయింటింగ్స్, ఇంట్లో నిత్యావసర వస్తువులు, మాంసప్రియులు చికెన్, మటన్ వంటలు వండుతుంటారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు భోగి మంటలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కనకాంబరాలు, జాజి, సంపెంగ, చామంతి, చెండు మల్లి, రోజా, కాకడాలు వివిధ రకాల పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ధనుర్మాసం సందర్భంగా ప్రతి ఊరిలోనూ నగర సంకీర్తనలు సాగుతున్నాయి. రంగవళ్లులు ఆకట్టుకుంటున్నాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ఓబులవారిపల్లె, జనవరి 13: కడప-చెన్నై జాతీయ రహదారిపై చిన్నఓరంపాడు వద్ద ఆగివున్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్‌కు వాసి వీరేశ్, వసంత కుటుంబ సభ్యులతో తిరుపతికి వెళుతుండగా ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్టు


మట్కా నిర్వాహకులతో సీఐ, ఎస్ఐ

కడప (క్రైం), జనవరి 13: పాత బైపాస్ వద్ద ఇద్దరు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఎస్ఐ రవికుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. కడప వాసులు పోలియనూరు సందీప్‌కుమార్, ఊటుకూరు సుబ్బరాయుడు మట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు సిబ్బందితో దాడులు చేసి రూ.60,500 నగదు, చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చాంపియన్‌షిప్ సాధించిన తూర్పు గోదావరి జిల్లా జట్టు


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన తూర్పు గోదావరి జట్టుతో పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్‌కుమార్

రాజంపేట, జనవరి13: ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జట్టు నిలిచింది. రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో మాజీ మంత్రి దివంగత పసుపులేటి బ్రహ్మయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పసుపులేటి ప్రదీప్ కుమార్, పసుపులేటి పవన్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. 45వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఇందులో అంతిమ విజయం తూర్పు గోదావరి జట్టు కైవశం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని విజయనగరం జట్టు, మూడో స్థానాన్ని కర్నూలు జట్టు కైవశం చేసుకున్నాయి. వీరికి నిర్వాహకులు కప్పులు, పతకాలను అందజేశారు. ఈ పోటీల్లో 12 జిల్లాల క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వీరికి పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. ఈ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన తూర్పు గోదావరి జట్టు 27వ తేదీన బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఈ పోటీల రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, సురేష్‌కుమార్, భరత్‌కుమార్, సుధాకర్, రమణ, విజయ నిర్మల, జయరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ఎంపికలకు అనూహ్యస్పందన


కబడ్డీ ఎంపికల పోటీలో ఆడుతున్న క్రీడాకారిణులు

కడప (స్పోర్ట్స్) జనవరి 13: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన 49వ జిల్లా కబడ్డీ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా ఔత్సాహిక కబడ్డీ బాల, బాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. అరుణకుమారి, అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌వీసుబ్బన్న ఎంపికలను చేపట్టారు. ఇందులో ఎంపికైన వారు నంద్యాల పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో 20 నుంచి 23 వరకూ జరగనున్న రాష్ట్ర జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ కార్యదర్శి వెల్లడించారు.
బాలుర విభాగంలో కేవీసుదర్శన్, ఎ. వేణుసాయి, ఎస్. సురేశ్, ఎన్. జస్వంత్, కె. చంద్రశేఖర్, బి. బ్రహ్మయ్య, డి. వంశీధర్‌రెడ్డి, ఎస్. రుషేంద్రసాయి, కె. విఘ్నేష్, ఎం. రామాంజి, ఎస్. హుస్సేన్, సి. పాల పవన్ ఎంపికవగా బాలికల విభాగంలో ఎం. శిల్ప, ఎన్. నాగజోత్స్న, ఎస్ పూజ, పి. నీలమహేశ్వరి, డి. విష్ణుప్రియ, డి. రేఖ, ఎస్. ఇందు, వై. రజిత, బి. మేరిమంజుల, ఎస్. రషిత, ఎం. ఆస్మ, ఎస్. మస్తానమ్మ, తదితరులున్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు బి. సుహాసిని, లీలావతి, సుమలత, ఆర్ సునీల్, గిరి తదితరులున్నారు.

ఐటీ ఉద్యోగులంతా ఏకం కావాలి

రాష్ట్ర భవిష్యత్తు కోసం పిలుపునిచ్చిన రాజంపేట టీడీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, చిత్రంలో సుగవాశి బాలసుబ్రహ్మణ్యం, రమేశ్ రెడ్డి

రాయచోటి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో ఉంటూ సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన ఐటీ ఉద్యోగులంతా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఏకం కావాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జరిగిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వారి 'మీట్ ది లీడర్' సమావేశానికి హాజరైన ఆయన రాజంపేట పార్లమెంట్ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, రాయచోటి టీడీపీ ఇన్‌చార్జ్ రమేశ్‌రెడ్డితో కలిసి 'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో ఉంటూ పండుగకు సొంత గ్రామాలకు వచ్చిన ఐటీ ఉద్యోగులంతా రాష్ట్రం బాగు కోసం ఒక దృఢ సంకల్పం చేయాలని ఐటీ ఉద్యోగులను కోరా రు. గ్రామ సమస్యలు, గ్రామ అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానిస్తూ గ్రామాల్లో ఓటరు జాబితాను సరిచూసుకోవాలని సూచించారు. పలువురు నేతలు, పెద్ద ఎత్తున ఐటీ ఉద్యోగులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురిపై కేసు నమోదు

గుర్రంకొండ, జనవరి 13:ప్రైవేట్ బస్సు కండెక్టర్‌పై దాడి చేసిన ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు బి.కొత్తకోటకు చెందిన సుంకర శ్రీనాథ్(25) కడప-బెంగుళూరు మార్గంలో ప్రయాణించే ఓ ప్రైవేటు బస్సు కండెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గుర్రంకొండకు చెందిన నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు బెంగుళూరులో బస్సు ఎక్కడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో బస్సులో కూర్చోవడానికి సీట్లు లేవని కండెక్టర్ చెప్పడంతో బస్సు బెంగుళూరు నుంచి కడపకు వెళ్లిపోయింది. తిరిగి బస్సు కడప నుంచి బెంగుళూరుకు వెళుతుండగా ఉదయం 11.30 గంటల సమయంలో గుర్రంకొండ బస్టాండుకు రాగానే అప్పటికే బస్టాండులో ఉన్న సాధిక్‌అహ్మద్, మురాషావలి, ఫయాజ్‌అహ్మద్, గౌస్‌మోహిద్దీన్, రఫీలు కండెక్టర్ శ్రీనాథ్‌పై తమ మహిళలను బస్సులో ఎక్కించుకు రాలేదంటూ మూకుమ్మడిగా దాడి చేశారు. అక్కడేవున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అల్లరి మూకలను తరిమేశారు. బాధితుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు ఐదు మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

గుర్రంకొండ, జనవరి 13:సంక్రాంతి పండుగను పురష్కరించుకొని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో కోడి పందేలు, పేకాట ఆడరాదన్నారు. ఇందుకు గానూ ప్రతి గ్రామంలో సిబ్బంది ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైన నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

వాహనం సహా ఎర్ర దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 13: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనంతో సహా 6 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. సుండుపల్లె అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు కేవీపల్లె మండలం మహల్ గ్రామం, గుర్రంకొండలలో వాహనాల తనిఖీ చేపట్టగా ఏపీ29 బీడీ 0684 కారును ఆపినా ఆగకుండా కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లె వైపు ముందు కు వెళ్లిపోయిందన్నారు. దానిని వెంబడించి అందులో 180 కేజీలు బరువున్న 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో తనతో పాటు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ప్రభుతేజ, చరణ్, మల్లిఖార్జున, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

● నిందితుడు అరెస్టు...ద్విచక్రవాహనం సీజ్

ములకలచెరువు, జనవరి 13: ములకలచెరువు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక తెలిపారు. సంపతికోట క్రాస్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ములకలచెరువు మండలం దాశిరెడ్డిగిరాపల్లెకు చెందిన నిందితుడు చంద్రప్ప(43)ని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తంబళ్ళపల్లె మండలం కోటకొండ దాగువ తాండా సమీపంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు.

పెయింటర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జనవరి 13: ఆర్థిక ఇబ్బందులతో ఓ పెయింటర్ ఆత్మహత్యకు యత్నించాడు. మండలంలోని పోతబోలు పంచాయతీ వలసమూలకు చెందిన శేషాద్రినాయుడు(26) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని అప్పులు చేసిన శేషాద్రినాయుడు వాటిని తీర్చలేక పోవడంతో కుటుంబీకులు అతడిని మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు అతడిని ఉరినుంచి తప్పించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.. ఇక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు శేషాద్రినాయుడు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు విచారిస్తున్నారు.

పెట్రోల్ పోసుకుని యువతి ఆత్మహత్యా యత్నం

పెద్దతిప్పసముద్రం జనవరి 13 : పెట్రోల్ పోసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీటీఎం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక పీటీఎం పోగచూరివీధిలో ఉన్న చాంద్‌బాష కుమార్తె సానియా (18) అనే యువతి బి.కొత్తకోటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోందని తెలిపారు. ఇటీవల జరిగిన పరీక్షలు బాగా రాయలేదని ఇంట్లో మదనపడి పోయేదని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం వేకువజామున ద్విచక్ర వాహనానికి తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో ఆమెను బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే ఆమెను మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఆత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు వెంటనే ఆమెను బెంగళూరుకు తరలించారు. ఈ ఘటనపై పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

కుక్క అడ్డురావడంతో కిందపడి యువకుడికి గాయాలు

మదనపల్లె టౌన్, జనవరి 13: ద్విచక్రవాహనంలో వెళుతున్న యువకుడు రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కింద పడి గాయాలపాలయ్యాడు. శనివారం నిమ్మనపల్లె మండలం గౌనివారిపల్లెకు చెందిన నరసింహులు(30) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో రామా చార్లపల్లె వద్ద ఓ కుక్క అడ్డుదూరింది. దీంతో కిందపడిపోయిన అతడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దొంగ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్

నిమ్మనపల్లి, జనవరి 13: దొంగ పత్రాలు సృష్టించి తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా ఆ భూమి చుట్టూ కంచెను కూడా ఏర్పాటు చేశాడని బాధితుడు గణపతి నాయుడు శనివారం మదనపల్లి డీఎస్పీ కేశప్పకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి ఎనుగొండవారిపల్లికు చెందిన రైతు గణపతి నాయుడుకు సర్వే నెంబరు. 1179.1 లెటర్‌లో 0.30సెంట్ల భూమి ఉందని అయితే అదే గ్రామానికి చెందిన శేషాచలనాయుడుకు అదే సర్వే నెంబరులో 0.25సెంట్ల భూమి ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా శేషాచలనాయుడు అతి తెలివి ప్రయోగించి సంబంధిత కార్యదర్శి దగ్గర ఖాళీ జాగా అని తెలపకుండా పన్ను కట్టినట్లు చలాను తీసుకున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే అదునుగా చేసుకొన్న శేషాచలనాయుడు గత ఏడాది డిసెంబరులో తన వద్ద ఉన్న ఇంటి రసీదు సమర్పించి మదనపల్లి రిజిస్టర్ కార్యాలయాని వెళ్లి తన పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడని అంతటితో ఆగకుండా ఆ భూమిలో కంచెను ఏర్పాటు చేశాడని వాపోయాడు. దీంతో మోసపోయిన గణపతినాయు డు రిజిస్ట్రేషన్ పత్రాలను సేకరించి తన భూమిని ఇప్పించి న్యాయం చేయాలని డీఎస్పీ కేశప్పను వేడుకున్నారు.

సమస్యల నడుమ వెయ్యిళ్లకాలనీ

● పట్టించుకోని అధికారులు, పాలకులు ● కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు ● దుస్థితిలో ఇందిరమ్మకాలనీ



వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో పిచ్చి పొదల నడుమ నివాసాలు



ఇళ్ల వద్ద మురుగుకాలువలు లేని దృశ్యం

వాల్మీకిపురం, జనవరి 13: వాల్మీకిపురం పట్టణ సమీపంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2013వ సంవత్సరం అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంతో కృతనిశ్చయంతో వాల్మీకిపురం సమీపంలో ఇందిరమ్మ కాలనీని ప్రారంభించారు. తొలుతగా 703నివాసాల కల్పనతో ప్రారంభమై వెయ్యి ఇళ్ల కాలనీగా రూపు దిద్దుకునేలా చర్యలు వేగవంతం చేశారు. అయితే అదికాల క్రమేణా కాలనీ వాసులకు శాపంగా మారిందనే చెప్పాలి. ప్రస్తుతం కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న తమకు కనీస వసతులు కరువయ్యాయని కాలనీవాసులు వాపోతున్నారు. వెయ్యి ఇళ్ల కాలనీలో ప్రారంభంలో గొప్పగా ఆర్చి నిర్మాణం, మొదటి మూడు వరుసలలో గృహాలకు తాగునీటి కుళాయిలు, డ్రైనేజీ కాలువలు ఉన్నాయి. తరువాత పై తట్టు ప్రాంతం నివాసాల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. కాలనీలోని నివాసాల చెంత దుర్గంధం, పిచ్చి పొదల నడుమ కాపురాలు తమ బతుకులు ఇంతేనా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా కాలనీ వాసుల బతుకులు ఇంతేనా అంటూ నిట్టూర్చుతున్నారు. కాలనీ ప్రాంతంలో ఎవరికీ వారు తమకు కావాల్సిన ప్రాంతాన్ని కబ్జా చేసుకునే ప్రయత్నాలు సైతం చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తమ కాలనీ ప్రాంతంలో కనీసం పదిరోజులకు ఒకసారి కూడా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో నిత్యం రోగాల బారిన పడుతున్నామని, కాలనీ వాసులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శిస్తున్నారు. మళ్లీ ఎన్నికల సమయాన ఓట్ల కోసం వస్తారు కదా అప్పుడు మా కాలనీకి ఏమి చేశారు అనే విషయ మై ఖచ్చితంగా నిలదీస్తామన్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ కాలనీ ప్రాం తంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు అన్నీ పరిష్కరిస్తాం..

వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు అన్నీ గుర్తించడం జరుగుతోంది. కాలనీ మొత్తం నివాసాలకు డ్రైనేజీల నిర్మాణం, వసతుల కల్పన, రోడ్లు తదితరం మొత్తం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులకు సంబంధించి మంజూరు ప్రతిపాదనలు వచ్చిన తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందిరమ్మ కాలనీ వాసులకు అన్ని వసతులు కల్పిస్తాం

-షబ్బీర్‌అహ్మద్, ఎంపీడీవో, వాల్మీకిపురం

టీడీపీ యాప్ విస్తృత ప్రచారం అభినందనీయం



టీడీపీ నాయకురాలు పర్వీన్‌ను సన్మానిస్తున్న దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, జనవరి 13: మన-టీడీపీ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తూ డిజిటల్ మీడియాతో ఉత్తమ ప్రతిభ కనపరచిన పార్టీ నాయకులను మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ అభినందించారు. శనివారం స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంతో పాటు పలువురు టీడీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి దొమ్మలపాటి వారిని సన్మానించారు. దొమ్మలపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు, చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. డిజిటల్ మీడియా ద్వారా ప్రజల్లోకి దూసుకెళ్తూ పార్టీ అధిష్ఠానం నుంచి అభినందన లేఖలు అందుకున్న దయాకర్, సుబ్రమణ్యంరెడ్డి, పర్వీన్, దీక్షిత్‌లను దొమ్మలపాటి శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మేకల రెడ్డిశేఖర్, చల్లా నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటి సరఫరా మూన్నాళ్ల ముచ్చటేనా?

● చౌక దుకాణాల వద్ద పడిగాపులు

● విసుపోతున్న లబ్ధిదారులు



వాల్మీకిపురంలో చౌకదుకాణం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

వాల్మీకిపురం, జనవరి 13: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి రేషన్ పంపిణీ కార్యక్రమం మూన్నాళ్ల ముచ్చటేనా? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్మీకిపురం వ్యాప్తంగా మొత్తం 13,738 రేషన్ కార్డులు ఉండగా తద్వారా లబ్ధిదారులు తమ రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమం కాస్తా నీరుగారింది. మండలంలోని 16గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 8 ఎండీయూ (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్) పేరిట వాహనాలను రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా ప్రారంభించింది. అయితే అది కాస్తా ఆచరణలో గ్రామీణ ప్రజలను సైతం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండటం గమనార్హం. మండలానికి కేటాయించిన 8 వాహనాలలో ఆరుగురు ఆపరేటర్లు ఇప్పటికే రాజీనామా చేయగా ప్రస్తుతం కేవలం రెండు వాహనాల ద్వారా మాత్రమే నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. గ్రామాలలో అయితే దాదాపుగా గత ఆరునెలలుగా రేషన్ సరుకుల పంపిణీ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వం నెలకు రూ.23వేలు వేతనాలు ఇస్తోంది. ఇందులో ఆపరేటర్‌కు రూ.18వేలు, వాహనంలో పనిచేసే హమాలీకి రూ.5వేలు చొప్పున ఇస్తోంది. ఇంతలో తాము గిట్టుబాటు కాక హమాలీలకు కూలీలు కూడా ఇచ్చుకోక నానా తంటాలు పడుతున్నామని ఆపరేటర్‌ల వాదన. అంతే కాకుండా పథకం ప్రారంభ రోజులలో ఎండీయూ ఆపరేటర్లకు వాహనానికి సంబంధించి రూ.70వేలు డిపాజిట్లు చేశామని, దానికి గాను మళ్లీ ప్రతినెలా తమ వేతనాలలో నెలకు రూ.5వేలు చొప్పున ప్రభుత్వం పట్టేస్తుండటంతో తమకు గిట్టుబాటు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పట్టణానికి చెందిన ఆరుగురు వాహనాల ఆపరేటర్లు రాజీనామాలు చేశారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రభుత్వ చౌకదుకాణాల చెంత కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా ఎంచక్కా సరుకులు తెచ్చుకునే వాళ్లమని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలోని చౌక దుకాణాల చెంత లబ్ధిదారులకు ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

పంపిణీ సక్రమంగా లేదు..



గ్రామాలలో రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేయడం లేదు. మా గ్రామానికి ఆరునెలలుగా రేషన్ సరుకుల పంపిణీ వాహనం రాక చాలా ఇబ్బందిగా తయారైంది. ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి. రేషన్ సరుకుల పంపిణీ ముందే బాగుండేది.

-ఎన్.ఆనంద్, పెరుమాళ్లయ్యగారిపల్లె, వాల్మీకిపురం

ముందే బాగుండే..



స్టోర్లో సరుకులంటే ఏదో ఓ పూట పోయి తెచ్చుకునే వాళ్లం. ముందే బాగుండే. ఇప్పుడేమో ఆటో వస్తదంట అంటే కాసుకోవాలి. మునలి, ముతక, కూలోళ్ల అందరికీ చానా బాధగా ఉంది. స్టోర్లోనే ఇస్తే బాగుంటుంది నాయనా.

-యర్రక్క, శాఖంవారిపల్లె, వాల్మీకిపురం

ప్రత్యామ్నాయం చూస్తున్నాం..

మండల వ్యాప్తంగా ఎండీయూ ఆపరేటర్ల రాజీనామాలతో రేషన్ సరుకుల పంపిణీకి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా ఆపరేటర్లుగా ఎవ్వరూ రావడం లేదు. వేతనాలు గిట్టవని ఆపరేటర్లు వాదన. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ వీఆర్‌వో, వీఆర్‌ఏల సమక్షంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

-ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్, వాల్మీకిపురం

టీడీపీ-జనసేన సభను విజయవంతం చేద్దాం



వాల్మీకిపురం మండలం చింతపర్తిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జనవరి 13: టీడీపీ-జనసేన సభను విజయవంతం చేద్దామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలంటే నారా చంద్రబాబునాయుడు ఒక్కడితోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తిలో మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో భూ కబ్జాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు పెట్రేగిపోయాయని మళ్లీ వైసీపీకి అవకాశం ఇస్తే అరాచకాలకు అడ్డు ఉండదని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన కలయికలో రాబోవు ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకమని గుర్తు చేశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈనెల 24న పీలేరుకు రానున్న సందర్భంగా ప్రతి గ్రామం నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని గ్రామాల వారీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్‌లతో చర్చించి సూచనలు చేశారు. అంతకు ముందుగా పార్టీల నాయకులు, కార్యకర్తలు నల్లారిని గజమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, పులి సత్యారెడ్డి, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, కాంతరాజు, సుధాకర్‌రెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, కేవీ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డిష్ బ్రదర్స్ కువైట్ సయ్యద్‌బాషా, హరినాథరెడ్డి, రాజేంద్రాచారి, మురళి, సురేష్‌కుమార్‌రెడ్డి, జయకృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బార్ సెక్రటరీ రమణ



టీడీపీలో చేరిన బార్ అసోసియేషన్ సెక్రటరి రమణ

వాల్మీకిపురం, జనవరి 13: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ సెక్రటరి రమణ శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా నల్లారి కిశోర్ రమణ, స్వర్ణలతలకు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం బార్ సెక్రటరీ రమణ మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధి ఒక్క చంద్రబాబునాయుడితోనే సాధ్యమన్నారు.

తెలుగుదేశం పార్టీకి బీసీలే పట్టుకొమ్మలు

● ప్రతిష్ఠాత్మకంగా జయహో బీసీ సదస్సులు ● శంకర్‌యాదవ్



పీటీఎం మండల నాయకులతో మాట్లాడుతున్న శంకర్‌యాదవ్

బి.కొత్తకోట జనవరి 13 : తెలుగుదేశం పార్టీకి బీసీలు ఎప్పుడు పట్టుకొమ్మలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని బీరంగి పంచాయతీ గుడిపల్లెలో పర్యటించి అనంతరం జయహో బీసీ సదస్సుపై బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోను 1000 మందికి తగ్గకుండా బీసీలను సమన్వయ పరచి, పార్టీ అధినేత చంద్రబాబు పిలుపు మేరకు జయహో బీసీ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తంబళ్లపల్లెలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కన్వీనర్లు, నారాయణస్వామి రెడ్డి, ఆనందరెడ్డి, నియోజకవర్గ పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, దేవరింటి కుమార్, మొటుకు శివ, సురేంద్ర, శ్రీనాథ్, గట్టు ఆంజీ, చాకనా రాజా, రంజిత్‌కుమార్, ఆనంద్‌రెడ్డి, శివానంద తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

మదనపల్లె అర్బన్, జనవరి 13: బర్మావీధిలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్లబాబునాయుడు పేర్కొన్నారు. ప్రతి ఏడాదిలాగే ఆలయంలో కల్యాణం నిర్వహిస్తామని అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

జగన్‌కు ఓటేసి తప్పు చేశాం..మమ్మల్ని మన్నించు తండ్రి

● మదనపల్లెలో గుంజిళ్లు తీస్తూ అంగన్వాడీల నిరసన

మదనపల్లె టౌన్, జనవరి 13: అంగన్వాడీలను ఉద్ధరిస్తానని పాదయాత్రలో సీఎం జగన్ చెబితే నమ్మి ఓట్లు వేసి తప్పుచేశాం...మమ్మల్ని మన్నించు తండ్రీ! అంటూ అంగన్వాడీలు గుంజిళ్లు తీస్తూ నిరసన తెలిపారు.. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 33వ రోజుకు చేరుకుంది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అడబిడ్డలకు ఏదో చేసేస్తాడని నమ్మి ఓట్లు వేశామని, కాని ఇచ్చిన మాట తప్పడమే కాక అంగన్వాడీల సమ్మెపై ఉక్కుపాదం మోపి అణగదొక్కాలని చూస్తున్నారన్నారు. జగన్‌ను కుర్చీ దింపడం ఖాయమని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పి.శ్రీనివాసులు, హరీంద్రనాథ్‌శర్మ మాట్లాడుతూ సీఎం జగన్ ఒంటెద్దు పోకడతో అంగన్వాడీ కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మంత్రులు చేపట్టిన అంగన్వాడీ నాయకుల చర్చలు విఫలమయ్యాయని, నిరవధిక సమ్మెను ఉద్యమంలా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సెక్టార్ లీడర్లు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకోగా తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఉమాదేవి, కరుణశ్రీ తదితరులు మాట్లాడుతూ...అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మొండి వైఖరి సరైనది కాదన్నారు. వేతనాలు పెంచకపోవడం, జీవో నెం:2 అమలు చేయడం, ఎస్మా ప్రయోగించడంపై అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల అంగన్వాడీలు పేర్కొన్నారు.



బి.కొత్తకోటలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బి.కొత్తకోటలో: అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక పెద్దలు, కేంద్రాల లబ్ధిదారులతో కోటి సంతాకాలు చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంపనున్నట్లు అంగన్వాడీ యూనియన్ లీడర్లు శ్రీవాణి, కుమారిలు పేర్కొన్నారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యక్తలు చేపట్టిన సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. యథా ప్రకారం ధర్నాలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, అంగన్వాడీల న్యాయమైన కోరికలను తీర్చాలని, జీవో నంబర్ రెండును రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

వాల్మీకిపురంలో: ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం విషయంలో చిన్నచూపు చూస్తోందని తమ సమ్మె ఉధృతం చేసి తమ హక్కులు సాధించుకుంటామని అంగన్వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు చేరుకున్న అంగన్వాడీ కార్యకర్తలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే న్యాయవాదులు, ఉద్యోగులు, ప్రజల నుంచి తమ సమ్మె పట్ల అభిప్రాయాలు, సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఎంత కష్టమొచ్చినా తలొగ్గేది లేదని తమ కనీస వేతనాలు, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, లక్ష్మీనరసమ్మ, రెడ్డిరాణి, దేవసేన, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

స్వామి చెరువు మునగడ ప్రాంతం ఆక్రమణ



స్వామి చెరువు మునగడ ప్రాంతంలో ఆక్రమిత స్థలం ఇదే

మదనపల్లె అర్బన్, జనవరి 13: మండలంలోని బసినికొండ పంచాయతీలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్వామి చెరువు మునగడ ప్రాంతంలో స్థలం అక్రమణకు గురైంది, మదనపల్లె రెడ్డి సంఘం వాళ్ల టిప్పర్లతో మట్టి తరలించి శుక్రవారం చదును చేశా రు. జాతీయ రహదారికి పక్కనే స్థలం ఉండడం, కోట్లు విలువ చేసే స్థలం కావ డంతో గ్రామరెవెన్యూ సర్వేనెంబరు 452 లోని భూమి అక్రమించడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ మహబూ బ్‌చాంద్‌క సమాచారం అందడంతో వెంటనే ఆక్రమణ స్థలంలో రెవెన్యూ అధికారుతో శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఇందులోకి ఎవ్వరైనా ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా స్థల ఆక్రమణపై తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌ను వివరణ కోరగా రెవెన్యూ అధికారులను పంపి ప్రభుత్వ భూమి ఆక్రమణ గురిఅవుతండడంతో హె చ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత మున్నా టీం



టోర్నీ విజేతలతో యూటీఎఫ్ నాయకులు

పీలేరు, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా పీలేరు మండలం దొడ్డిపల్లెలో యూటీఎఫ్ నిర్వహించిన క్రికెట్ టోర్నీలో పీలేరుకు చెందిన మున్నా టీం విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో విజేతగా మున్నా టీం, రన్నర్‌గా కొత్తపేట టీం నిలిచింది. విజేతలకు రూ.15,116, రన్నర్‌కు రూ.7,116ల ప్రైజ్ మనీని యూటీఎఫ్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మరిన్ని క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, టోర్నీ నిర్వాహకులు సుధాకర్ దంపతులు, హెచ్ఎంల సంఘ అధ్యక్షుడు మోడెం చెంగల్రాయులు, నాయకులు అక్రమ్ బాషా, చంద్రశేఖర్, రాచపల్లె కృష్ణమూర్తి, సదాశివరెడ్డి, రాధాకృష్ణ, వెంకటరమణ, శెట్టిసుబ్రహ్మణ్యం, పోతయ్య, ఐవోబీ మేనేజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వేపూరికోటలో ముందస్తు సంక్రాంతి సంబరాలు




సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ములకలచెరువు, జనవరి 13: మండలంలోని వేపూరికోట ఎస్సీ పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గాలిపటాలు ఎగరేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి కరస్పాండెంట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో ముగ్గుల పోటీలు

పీలేరు, జనవరి 13: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పీలేరు పట్టణంలో 15వ తేదీ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పీలేరు లయన్స్ క్లబ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా తమ ఇంటి లోగిళ్ల ముందు అందమైన ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 15వ తేదీ ఉదయం తమ క్లబ్ సభ్యులు పట్టణంలోని అన్ని వీధుల్లో తిరిగి విజేతలను నిర్ణయిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు 9441392689, 950222334 నెంబర్లకు ఫోను చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

బి.కొత్తకోట జనవరి 13 : ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పేర్కొన్నారు. బి.కొత్తకోట పట్టణంలో జరిగిన సీపీఐ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి దేశ ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తోందన్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టి, ప్రజలను విడగొట్టి, లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ తంబళ్లపల్లె ఏరియా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, సలీంబాష, రఘునాథ్, జవహర్‌బాబు, షమీవుల్లా, నిజాముద్దీన్, దయాకర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నగరిలో చిరుత సంచారం

రెండు లేగదూడల హతం



మృతి చెందిన లేగదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు - మామిడి తోపులో చిరుత పాదముద్ర

ఐరాల, జనవరి 13: ఐరాలకు కూతవేటు దూరంలోని నగరిలో శనివారం వేకువ జామున రెండు లేగదూడలను చిరుత పులి చంపేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలంలోని ఈడిగపల్లెకు చెందిన రెడ్డెప్ప తన పశువులను శుక్రవారం రాత్రి నగరిలోని తన మామిడి తోటలో కట్టేశాడు. శనివారం వేకువ జామున తోటలోకి చొరబడ్డ చిరుతపులి అక్కడ కట్టి ఉన్న రెండు లేగ దూడలను చంపేసింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ రేంజ్ అధికారి బాలకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి, పరిశీలించారు. గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించవద్దని, అడవిలో క్రూర జంతువులు కూడా ఉన్నాయని హెచ్చరించారు. అలాగే పశువులను మేత కోసం అడవిలోకి తీసుకెళ్లొద్దని చెప్పారు. ఈ మేరకు గ్రామంలో దండోరా వేయించారు. కాగా.. ఇటీవల నగరికి సమీపంలోని తోకబండ వద్ద ఓ ఆవును చిరుత చంపేసిన విషయం తెలిసిందే.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటేష్‌నాయక్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి - ఆలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల(కాణిపాకం), జనవరి 13: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్‌నాయక్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే స్వామిని పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. వీరిని చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, రాయలసీమ స్త్రీశిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్‌పర్సన్ శైలజ, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజ, జడ్పీటీసీ సుచిత్ర, ప్రముఖ పారిశ్రామిక వేత్త పూజారిమోహన్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో అన్నదానానికి రూ.4.01 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న గిరిబాబు, వెంకటరెడ్డి

ఐరాల(కాణిపాకం), జనవరి 13: కాణిపాక క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పీలేరుకు చెందిన గిరిబాబు శనివారం రూ.3,01,116 విరాళంగా అందించారు. అలాగే ఎర్రగుంట్లకు చెందిన ఎస్.వెంకటరెడ్డి కూడా రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వామి దర్శనం కల్పించి, శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రూ.4లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు, కారు సీజ్



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు, జనవరి 13: అక్రమంగా తరలిస్తున్న రూ.4లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేసి, కారును సీజ్ చేశారు. వివరాలను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి డీఎస్పీ శ్రీనివాసమూర్తి శనివారం మీడియాకు తెలిపారు. కొన్ని రోజులుగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఒకటో పట్టణ పోలీసులకు వచ్చిన రహస్య సమాచారంతో ఎస్ఐ, సిబ్బంది అశోకపురంలోని గాస్పెల్ చర్చి వద్దకు వచ్చారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న గూలింగ్స్‌పేటకు చెందిన లోకేష్(23) పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో అతడి ఆధీనంలో ఉన్న ఓ కారును తనిఖీ చేశారు. అందులో కర్ణాటకకు చెందిన రూ.4 లక్షల విలువ చేసే 1,700 మద్యం టెట్రా ప్యాకెట్లు గోనె సంచిలో కనిపించాయి. కారుతోపాటు ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

రేషన్ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, జనవరి 13: యానాదివెట్టు గ్రామంలో శనివారం గ్రామస్తులు ఆర్బీకే చైర్మన్ మురళినాయుడు ఆధ్వర్యంలో రేషన్ వాహనాన్ని అడ్డుకున్నారు. బియ్యం మినహా కందిపప్పు, గోధుమపిండి, చక్కెర ఇవ్వకపోవడంపై నిలదీశారు. వాహన నిర్వాహకులు డీలర్‌తో మాట్లాడాలని స్పష్టం చేశారు. దీంతో వారు డీలర్ లతతో మాట్లాడగా వచ్చినవి మాత్రమే ఇచ్చామని లేనివి ఎలా ఇవ్వగలమని ఎదురు ప్రశ్నించారు. పైగా దిక్కున్నచోట చెప్పుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని మురళి నాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పొలం పనుల్లో రైతులు - తిరుమలకు నడిచి వెళుతున్న కర్ణాటక భక్తులు

మంచు సోయగం

ఉదయం తొమ్మిది గంటలు దాటినా పొగ మంచు తెరలు వీడటం లేదు. రోడ్లపై లైట్ల వెలుగులో వెళుతున్న వాహనాలు, వ్యవసాయ పనుల్లో రైతులు, తిరుమల వెంకన్న దర్శనానికి నడిచి వెళుతున్న భక్తులు, ఉదయ భానుడి కిరణాలు శనివారం కనువిందు చేశాయి. - సోమల

కోటి సంతకాలతో 'జగనన్నకు చెబుదాం'

● పలమనేరులో అంగన్వాడీల సమ్మెకు మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సంఘీభావం



పలమనేరులో అంగన్వాడీలకు మద్దతు పలుకుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి - కార్వేటినగరంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

చిత్తూరు, జనవరి 13: జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు చేపడుతున్న సమ్మె శనివారంతో 33వ రోజుకు చేరింది. కుప్పం, పలమనేరు ప్రాజెక్టుల్లో ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద, చిత్తూరులో కలెక్టరేట్, కార్వేటినగరంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెను నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ● చిత్తూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న సమ్మె శనివారం విరామం ప్రకటించి వర్కర్లు పనిచేస్తున్న వార్డుల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులతో తమ సమస్యలను చెప్పి.. సంతకాలు సేకరించారు. ● పలమనేరు సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. వీరికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సంఘీభావం ప్రకటించారు. వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ● కుప్పంలో అంగన్వాడీ వర్కర్లు సీడీపీవో కార్యాలయం వద్ద సమ్మె చేశారు. కోటిసంతకాల సేకరణ చేపట్టారు. ● కార్వేటినగరంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమ్మె నిర్వహించారు. ఇక్కడా కోటి సంతకాల సేకరణ మొదలుపెట్టారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు.

సంక్రాంతి నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు

● సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



ఏఎస్ఎన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సంక్రాంతి పండుగ నుంచి ఖాతాదారుల సౌకర్యార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సౌకర్యాలతో కూడిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం చిత్తూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపాజిట్లపై ఇతర బ్యాంకులకంటే 3.5శాతం అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు వివరించారు. 2022-23 ఆర్థికసంవత్సరంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.2243 కోట్ల దాకా పెరిగినట్లు చెప్పారు.ఆరు జిల్లాల్లో 240 శాఖలతో నడుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖలను త్వరలో మరో 10చోట్ల ప్రారంభిస్తామని తెలిపారు. డిపాజిట్లపై 1-2 సంవత్సరాల వరకు సాధారణ ఖాతాదారులకు 7.50శాతం, 60ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ, 2-3 సంవత్సరాల వరకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం అందిస్తామన్నారు. దీనబంధు పథకం కింద బంగారు నగల రుణాలు, ఎస్సీ, బీసీ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో బంగారుపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న తరహా బ్యాంకుల్లో అతి తక్కువ నిరర్థక ఆస్తులు కల్గిన బ్యాంకుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుర్తింపు పొందిందన్నారు. తమ బ్యాంకులో ట్యాక్స్ సేవర్ డిపాజిట్ అందుబాటులో ఉందని, దీని ద్వారా ఖాతాదారులు 80-సి రాయితీ పొందవచ్చన్నారు. తమ బ్యాంకులో నిల్వచేసిన బ్యాంకు ఖాతాదారుల సొమ్ముకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

పుంగనూరులో రాజ్యాంగం వర్తించదా?

సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు



చిత్తూరు రూరల్, జనవరి 13: పుంగనూరులో భారత రాజ్యాంగం వర్తించదా.. అని ప్రభుత్వ, పోలీస్ అధికారులను సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు సూటిగా ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో శుక్రవారం బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ధర్మపోరాట సభను నిర్వహించడానికి ఆ పార్టీ కార్యకర్తలు సన్నాహాలు చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం సమావేశాలు, సభలు నిర్వహించుకోవడానికి హక్కు ఉన్నప్పటికీ పుంగనూరులో మాత్రం పోలీసులు వ్యవహరించిన తీరు సబబు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అధికార పార్టీకి చెందినవారు తమ సభలు, సమావేశాలు, పుట్టిరోజులు, బస్సు యాత్రలు నడిరోడ్డులో పెట్టుకున్నా పోలీసులు అడ్డుచెప్పడం లేదని వాపోయారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ : ఒంగోలువాసి మృతి

పూతలపట్టు, జనవరి 13: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన రాజేష్, చిన్న మాలకొండయ్యలు పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు పని నిమిత్తం శనివారం రాత్రి పది గంటలకు పొలకల సంతగేటుకు ద్విచక్ర వాహనంలో వెళుతూ పాటూరు దళితవాడ వద్దకు రాగానే, అదే దళితవాడకు చెందిన నారాయణ పొలకలసంతగేటు నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చిన్న మాలకొండయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో డ్రోన్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం

టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్



తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో డ్రోన్ వినియోగంపై ఉన్న నిషేధం గురించి భక్తులకు అవగాహన కల్పిస్తామని టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్ తెలిపారు. తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం డ్రోన్ కెమెరాలో వీడియో తీస్తూ పట్టుబడిన హర్యానాకు చెందిన దినేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు చెప్పారు. కెమెరాలో ఘాట్ రోడ్డు విజువల్స్ తప్పా తిరుమలలో ఎక్కడా వీడియో తీసినట్లు లేదన్నారు. ఆయన సెల్‌ఫోన్‌ను కూడా పరిశీలన చేశామన్నారు. ఆర్మీకి చెందిన దినేష్ చాలా బాధ్యత కలిగిన వ్యక్తి అన్నారు. ఆలయాల పర్యటనలో భాగంగా తిరుమలకు వచ్చిన ఆయన కొండలను తీసే ప్రయత్నం చేశారన్నారు. తిరుమలలో డ్రోన్ నిషేధం ఉన్న విషయం ఆయనకు తెలీదన్నారు. పైగా ఆ డ్రోన్ ప్లాస్టిక్‌ది కావడంతో అలిపిరిలో ఉన్న స్కానర్లు స్కాన్ చేయలేదన్నారు. అలిపిరిలో అత్యాధునిక స్కానింగ్ యంత్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్!

వైసీపీలో రెడ్లకు తప్ప అన్ని కులాలకూ అన్యాయమే ● జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్



సమావేశంలో విజయానందరెడ్డిపై ఉన్న కేసుల కాగితాలను చూపుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 13 : సీఎం జగన్ ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడం దారుణమని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న ఒక్క బలిజ సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులకు సీటు ఇవ్వకపోయినా వైసీపీని ఆయన వెనకేసుకురావడాన్ని తప్పుపట్టారు. వైసీపీలో రెడ్లకు తప్ప ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు ప్రాధాన్యత లేదని విమర్శించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో రెడ్ల స్థానాలు తప్ప అన్ని స్థానాలు మార్చేయడమే దీనికి నిదర్శనమన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్, చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిపై తమిళనాడు, కర్ణాటక, ఏపీలో 48 కేసులతో పాటు పీడీ యాక్ట్ నమోదైందన్నారు. ఇలాంటి వ్యక్తులను జగన్ ప్రోత్సహిస్తూ ఉంటే ప్రజాస్వామ్యం ఉంటుందా అని ప్రశ్నించారు. స్మగ్లర్‌కు ఉన్న విలువ కాపులకు లేదన్నారు. ఇప్పటికైనా వైసీపీలో ఉన్న కాపులు బయటకు వచ్చి వాస్తవాలు మాట్లాడాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు పవన్ కల్యాణ్‌పై చేసిన ఆరోపణలను ఖండించారు. ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న మంత్రి రోజాపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజమోహన్, సుమన్‌రాయల్, హిమవంత్, వంశీ, నాగరాజురాయల్, సురేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మధ్యప్రదేశ్‌వాసి దుర్మరణం

కల్లూరు, జనవరి 13: పులిచెర్ల మండలం కల్లూరు - సదుం మార్గంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌వాసి దుర్మరణం చెందాడు. ఎస్ఐ రవి ప్రకాశ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన గుడ్డు బర్మన్ అనే వ్యక్తి ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుండేవాడు. శనివారం అర్ధరాత్రి కల్లూరు-సదుం మార్గంలో నడుచుకుంటే విధులకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడేమృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తిలో కోడి పందేలకు భారీ సన్నాహాలు

శ్రీకాళహస్తి, జనవరి 13: శ్రీకాళహస్తి పరిధిలో భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు జూదరులు సన్నాహాలు చేసుకున్నట్లు సమాచారం. అడ్డుకునే వారే ఉండరంటూ కొందరు బాహాటంగా చర్చించుకుంటున్నారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ నగర్, ఇదే మండలంలోని రామాపురం, మన్నవరం, వెంకటగిరి సరిహద్దు గ్రామాల్లో, అలాగే తొట్టంబేడు మండలం గద్దగుంట వద్ద భారీ ఎత్తున కోడి పందేలు ఆదివారం ఉదయం నుంచే నిర్వహించేందుకు కొందరు సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం.

విశాఖ చేరిన ఇండిగో ప్రయాణికులు

రేణిగుంట, జనవరి 13: తిరుపతి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం విమానం రద్దు కావడంతో ఆందోళన చెందిన విశాఖ ప్రయాణికులకు శనివారం ఉదయం ఇండిగో యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 26 మంది ప్రయాణికులు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు.గంటలకొద్దీ వేచివున్నాక ఇండిగో యాజమాన్యం సర్వీసు రద్దుచేయడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆందోళనకు దిగారు. చివరకు శనివారం ఉదయం 9.50 గంటలకు ఇండిగో యాజమాన్యం విమానం ఏర్పాటు చేసి వారిని విశాఖ పంపింది.

అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్టు

రూ. 8 లక్షల విలువైన రాగి వైర్లు, 3 ద్విచక్ర వాహనాల స్వాధీనం



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న సీఐ గంగిరెడ్డి

చిత్తూరు, జనవరి 13: అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8.26 లక్షల విలువైన రాగి వైర్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను చిత్తూరు తాలూకా సీఐ గంగిరెడ్డి పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాకు తెలిపారు. కొంతకాలంగా జిల్లాలోని పలు మండలాల్లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైర్లను ఎత్తుకెళుతున్నారు. వారం కిందట ఇటువంటి కేసు ఎన్ఆర్‌పేట పోలీసుస్టేషన్‌లోనూ నమోదైంది. విచారణలో దొంగల గురించి కచ్చితమైన సమాచారం అందింది. తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్‌పేట ఎస్ఐ కేవీ సుబ్బమ్మ, జీడీ నెల్లూరు ఎస్ఐ రామాంజినేయులు, ఈస్టు సర్కిల్ సిబ్బంది రాజ్‌కుమార్, సుధాకర్ కలిసి ఈ దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచారు. శనివారం ఉదయం ఆరు గంటలకు చిత్తూరు రూరల్ మండలం చిత్తూరు-తిరుత్తణి రోడ్డులోని కుర్చివేడు క్రాస్ వద్ద పాలసముద్రం మండలం కన్నికాపురం దళితవాడకు చెందిన దినేష్(22), వీఆర్‌కుప్పంకు చెందిన ఆదిత్య(19), ఆర్. దినేష్(22), ప్రవీణ్‌కుమార్(23), ఆలీ అబ్బాస్(25), వేలూరు జిల్లా వాలాజాకు చెందిన సూరి ఏళుమలై (23)లను పట్టుకున్నారు. విచారణలో జిల్లాతోపాటు తమిళనాడులోనూ వీరు చోరీలకు పాల్పడినట్లు తేలింది. అనంతరం వారి వద్ద నుంచి రూ.8.26 లక్షల విలువైన 757 కిలోల కాపర్ వైర్లు, 250 మీటర్ల కరెంటు కేబుల్‌వైర్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులకు నగదు రివార్డులిచ్చి అభినందించారు.